క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ వితరణ



అచ్చంపేట రూరల్: మండలంలోని బొమ్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు మంగళవారం పట్టణంలోని జ్యువెలరీ దుకాణ యజమాని చంద్రశేఖర్ రూ. 15 వేల విలువైన ప్రింటర్‌ను అందించారు. దాతను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిరాం, మాజీ సర్పంచ్ బోద్యనాయక్, ఉపాధ్యాయులు మోతీరాం, హరిలాల్, నర్సింహులు, తిర్పతయ్య, జానకిరాం, సరోజిని, లక్ష్మణ్, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా విజయ్‌కుమార్



కోడేరు: తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా జిల్లెడు చౌదరిగూడెం నుంచి బదిలీపై మండలానికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ సైదులుగౌడ్ యాదాద్రి జిల్లాకు బదిలీపై వెళ్లారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్‌ఐ సురేందర్, జమ్ములయ్య, మహేష్ తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

తాడూరు: మండలంలోని దుందుబీ వాగుతో పాటు ఆయా గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పుట్టా మహేష్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుందుబీ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఆయా గ్రామాలకు చెందిన ట్రాక్టర్ వాహనదారులు ఇష్టానుసరంగా రాత్రివేళలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం మేరకు తమ సిబ్బందితో తనిఖీలు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరుగురు ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హరిహర టౌన్‌షిప్‌లో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజేయేంద్ర సరస్వతిస్వామి ఆశీస్సులతో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేద పారాయణం, గురు ప్రార్థన, గో పూజ, గణపతి పూజ, రక్షాబంధనం, దీక్షాధరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆంజనేయస్వామి దేవాలయంలో సుబ్రమణేశ్వర స్వామి నవగ్రహ శిఖర, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 22వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ కొసలేంద్ర కుమార్ సిన్హా పేర్కొన్నారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశామని వివరించారు.

23 నుంచి ఆలయ వార్షికోత్సవాలు



అమ్రాబాద్: మండలంలోని మాచారంలో ప్రసిద్ధి పొందిన సీతారామాంజనేయ స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 23వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ, అనూష ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ జలంధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. స్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, స్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

కోలాటం, అడుగుల భజన పోటీలు

జిల్లా స్థాయిలో అడుగుల భజన పోటీలు, నియోజకవర్గ స్థాయి కోలాటం పోటీలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 25,000, ద్వితీయ బహుమతి రూ.15,000, తృతీయ బహుమతిగా రూ.10,000 నగదు బహుమతులు అందజేస్తామని వివరించారు.

మున్సిపల్ అభివృద్ధికి ప్రాధాన్యం

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ సమక్షంలో కొల్లాపూర్ మున్సిపాలిటీ బడ్జెట్ ప్రకటన

కొల్లాపూర్: కొల్లాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. మంగళవారం కొల్లాపూర్ మున్సిపాలిటీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ అంచనాల బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశానికి మంత్రితో పాటు, అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. సమావేశంలో బడ్జెట్ వివరాలను కమిషనర్ శ్రీనివాస్ వినిపించారు. బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించారు. పలు అంశాలపై మంత్రి అధికారులతో మాట్లాడారు. కొల్లాపూర్ మున్సిపాలిటీలో టాయిలెట్ల నిర్మాణాలపై ఆరా తీశారు. మినీస్టేడియం, సంతబజారుతో పాటు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాడ్రన్ టాయిలెట్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. వీటికోసం రూ.25 లక్షలు మంజూరు చేయిస్తా అన్నారు. మినీస్టేడియంలో అసంపూర్తిగా ఉన్న స్విమ్మింగ్ పూల్ పనులు కూడా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో అందరూ సమష్టిగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనుల కోసం ఎవరైనా వస్తే వెంటనే నా దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. తొలిసారి సమావేశానికి వచ్చిన మంత్రికి చైర్‌పర్సన్, కమిషనర్‌తో పాటు వైస్‌చైర్‌పర్సన్ మహిమూదాబేగం పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాధారణ అంచనా బడ్జెట్ వివరాలు ఇలా...

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ అంచనా రూ.7,22,53,000 ప్రకటించారు. 2025 మార్చి నాటికి మిగులు బడ్జెట్‌గా రూ.2.12 లక్షలుగా పేర్కొన్నారు. బడ్జెట్ లెక్కల ప్రకారం ఆదాయానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పన్నుల ద్వారా రూ.106.58 లక్షలు, అద్దెలు, పెనాల్టీల ద్వారా రూ.111.03 లక్షలు, ట్రేడ్ లైసెన్సులు, ఫెనాల్టీల ద్వారా రూ.4.50 లక్షలు, టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.90లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ.32 లక్షలు, నాన్‌గ్రాంట్ ప్లాన్ల ద్వారా రూ.239.92లక్షలు, ప్లానింగ్ గ్రాంట్ ద్వారా రూ.35లక్షలు, ఇతర గ్రాంట్ల ద్వారా రూ.10లక్షలు, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మిగులు నిల్వ రూ.93.50 లక్షలుగా ప్రకటించారు.

బడ్జెట్‌లో ఖర్చుల వివరాలు ఇలా..

జీతాలు, వేతనాల ఖర్చు రూ.175 లక్షలు, శానిటేషన్ విభాగం ఖర్చు రూ.41 లక్షలు, కరెంట్ చార్జీల ఖర్చు రూ.50 లక్షలు, గ్రీన్ బడ్జెట్ ఖర్చు రూ.34.41 లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ఖర్చు రూ.30లక్షలు, పరిపాలన నిర్వహణ ఖర్చు రూ.47.77 లక్షలు, టౌన్ ప్లానింగ్ విభాగం ఖర్చు రూ.4లక్షలు, 1/3 బడ్జెట్ ఖర్చు రూ.3.81 లక్షలు, పబ్లిక్ ఎమినిటీస్ ఖర్చు రూ.17లక్షలు, వార్డుల వారీగా ఖర్చులు రూ.82లక్షలు, నాన్ ప్లాన్ గ్రాంట్లు రూ.239.92 లక్షలు, ప్లానింగ్ గ్రాంట్లు రూ.35లక్షలు, ఇతర ఖర్చులు రూ.10లక్షలు, మిగులు బడ్జెట్ అంచనా రూ.2.12 లక్షలుగా ప్రకటించారు. ఈ బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం ప్రకటించారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

కందనూలు: మారుమూల గిరిజన తండాల్లోని లంబాడీల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. లంబాడి గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ ఆచరిస్తూ.. ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు రూ. కోటి నుంచి రూ.2 కోట్లకు పెంచిందనే విషయాన్ని గుర్తుచేశారు. వచ్చే సంవత్సరం నాటికి బంజారా భవన నిర్మాణానికి స్థల కేటాయింపునకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు మన్యనాయక్, ఉత్సవ కమిటీ నాయకులు గోపాల్ నాయక్, గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు రాముడు నాయక్, రాంజీ నాయక్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



సంత్ సేవాలాల్‌కు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తాగునీటి సమస్య రానీయొద్దు

రానున్న వేసవికాలంలో తాగునీటి సమస్య రానీయొద్దని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డితో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంతో పాటు గిరిజన తండాలు, పల్లెల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరం ఉన్న చోట నూతన బోర్లు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

అచ్చంపేట రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల విధులను రెవెన్యూ అధికారులు, సిబ్బంది సక్రమంగా నిర్వర్తించాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూతుల వివరాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తబిత, నాయబ్ తహసీల్దార్ రాములు, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రేఖా, వివిధ మండలాల తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

వైభవంగా ఈదమ్మ షిడె



షిడెను లాగుతున్న రైతు సంఘం నాయకులు



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొల్లాపూర్: పట్టణంలోని ఈదమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంకాలం షిడెమానోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి షిడెపైకి ఎక్కి అమ్మవారి రూపంలో భక్తులకు ఆశీర్వాదాలు ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులు ఈదమ్మ దేవతకు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లు బలిఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంకాలం సంప్రదాయబద్ధంగా ఆలయ పూజారులు, రైతుసంఘం నాయకులు షిడెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో షిడెను ఊరేగించారు. ఉత్సవానికి కాంగ్రెస్ నాయకులు నర్సింహ్మారావు, ఖాదర్ పాషా, బరిగెల రాముడు, బద్దుల చంద్రయ్య, కృష్ణ కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, రాంచందర్‌యాదవ్, చంద్రశేఖర్‌శెట్టి, జాఫర్, బిజ్జ వేణు, కాటం జంబులయ్య తదితరులు హాజరై ఈదమ్మ దేవతను దర్శించుకున్నారు.

నేడు వీరభద్రుడి ఊరేగింపు

కందనూలు: జిల్లా కేంద్రంలో ఈనెల 21న శివదీక్ష స్వాములు ఆధ్వర్యంలో వీరభద్రుడి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గురుస్వామి విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ శివాలయం నుంచి ఊరేగింపు ప్రారంభమై కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

చదువుతోనే అభివద్ధి

తెలకపల్లి: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ విద్యాసంస్థను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. చదువు ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం, సీఎల్ ఆర్ విద్యా సంస్థ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ చీఫ్ అడ్వైజర్ కే లక్ష్మారెడ్డి, కరస్పాండెంట్ రాజమహేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం



అచ్చంపేట రూరల్: గణిత, సైన్సు ఒలంపియాడ్ టెస్టులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన అచ్చంపేట న్యూ ఎక్సీడ్ స్కూల్ విద్యార్థులను మంగళవారం యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్కూల్ ప్రిన్సిపాల్ కపిలవాయి శ్వేత మాట్లాడారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఒలంపియాడ్ పోటీ పరీక్షలో 15 వేల మంది విద్యార్థులు పాల్గొనగా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒలంపియాడ్ టెస్టు నిర్వహించగా సైన్సు విభాగంలో ఆరో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. అలాగే హేతాజ్ఞ, జశ్వంత్ గణితంలో జిల్లా రెండో ర్యాంకు, కార్తీకేయ సైన్సులో జిల్లా రెండో ర్యాంకు, సహస్ర గణితంలో జిల్లా మూడో ర్యాంకు సాధించారు. రిషిక, అమూల్య జిల్లా కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, బోధించిన ఉపాధ్యాయ బృందాన్ని స్కూల్ కరస్పాండెంట్ కపిలవాయి చంద్రమోహన్‌అభినందించారు.

కొవ్వొత్తుల ర్యాలీ



అచ్చంపేట రూరల్: రాష్ట్ర సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం అచ్చంపేట జేఏసీ నాయకులు నివాళులు అర్పించారు. పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు ఈశ్వర్‌లాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో 1200 మంది అమరులయ్యారన్నారు. గత ప్రభుత్వంలో అమరవీరులకు, ఉద్యమకారులకు అవమానాలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల ఆశయాలు, ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మహబూబ్ అలీ, కాట్రావత్ శీను, మైనార్టీ నాయకులు సాధిక్ , ఖదీర్, ఖలీమ్, మత్రు, తిరుపతయ్య, శంకర్, ప్రేమ్ పాల్గొన్నారు.

23న కార్యకర్తల సమావేశం

కల్వకుర్తి రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, మల్లు రవి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, మేఘా రెడ్డి తోపాటు పలువురు హాజరవుతారని పేర్కొన్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత



కందనూలు: ఇటీవల మరణించిన పీఆర్‌టీయూ టీఎస్ క్రియాశీలక సభ్యుడు ప్రసాద్ గౌడ్ కుటుంబాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావులు స్పందించి రాష్ట్ర శాఖ ఉపాధ్యాయ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్ గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బల్మూరి రాంచంద్రారావు, ప్రధాన కార్యదర్శి తుమ్మల సురేందర్ రెడ్డి, పత్రికా సంపాదక వర్గ సభ్యులు దొడ్డ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా సాముహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో ఉదయం నుంచే భక్తులు పాల్గొని పూజల్లో నిమగ్నమయ్యారు. అదే విధంగా ఐతోల్, పాపాగల్, సిర్సవాడ, ఎత్మతాపూర్‌లలో సాముహిక వ్రతాలు ఆచరించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



మంగనూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా భార్గవి, డీఈవోగా మహేశ్వరీ, హెచ్‌ఎంగా శ్రావణి, ఎంఈవోగా కావ్య, మరో 25 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతయ్య ఉపాధ్యాయులు ఫణికుమార్, ప్రసాద్, సుదర్శన్, రఘునందన్, అసియాబేగం, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని గ్లోబల్ అక్షరభ్యాస పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. కలెక్టర్‌గా ప్రాహర్షిణి, డీఈఓగా లోకబందు, ఎంఈఓగా ఈక్షిత్, హెచ్‌ఎంగా ఆరాధ్యతో పాటు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, కరుణాకర్, సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోడేరులో..

పాడి పశువులను కాపాడుకుందాం



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య అధికారులు

వెల్దండ: పాడి పశువులను కాపాడుకుందామని జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ జి.వి. రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దాపూర్‌లో జెర్సీ ఆవులకు, దూడలకు థైలిరియా రోగ నిరోధక టీకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పాడి ఆవుల రక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాల ఉత్పత్తి అధికంగా రావడానికి పాడి ఆవులకు పచ్చమేతతో పాటు అనుకూలమైన వాతావారణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యామ్‌సుందర్, సిబ్బంది నరేష్‌రెడ్డి, రియాజ్, వెంకన్న, నరసింహ, గోపాల మిత్రలు బాలు, సాయిబాబా, విజేందర్, విశాల్ ఉన్నారు.

చారకొండ: గ్రామాల్లో క్రాస్ బీడ్ (సంకర జాతి)ఆవులకు వ్యాధినిరోధక థైలేరియా టికాలను తప్పనిసరి వేయించాలని మండల పశువైద్య అధికారి శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం క్రాస్ బీడ్ ఆవులకు వ్యాధినిరోధక థైలేరియా టికాల పంపిణీ చేశారు. మండల కేంద్రంలో దాదాపుగా 80 ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఐదు వందల ఆవులకు థైలేరియా టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ షేక్ మదర్, సిబ్బంది శివరాం, గోపాలమిత్ర గిరి, మల్లయ్య, రైతులు ఉన్నారు.

రోగులకు ఇబ్బందులు కలగనివ్వం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వమని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వస్తుందని, బయట వ్యక్తులు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. కు.ని ఆపరేషన్ కోసం వచ్చిన బాధితురాలు ప్రభుత్వ ఆస్పత్రికి రాలేదని, ఎక్కడో ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుందని తెలియజేశారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉన్నా.. వాటన్నింటిని అధిగమించి రోగులకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

కోడేరు: సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటామని కోసా ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ మోడల్ స్కూల్ పాఠశాలలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలీసెట్ ఉచిత కోచింగ్ కోసం విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు సాయిమేధా కోచింగ్ సెంటర్‌లో ఉచిత కోచింగ్‌తో పాటు మెటీరియల్, హాస్టల్ వసతి కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న శశికాంత్

అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ సేవలు



మాట్లాడుతున్న జూలూరి రమేష్ బాబు

కల్వకుర్తి రూరల్: అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ సేవలు కొనసాగుతున్నాయని ఆ క్లబ్ ఇంటర్‌నేషనల్ సీనియర్ వైస్ ప్రసిడెంట్ జూలూరి రమేష్ బాబు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ క్యాబినేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలోని విభిన్న వర్గాల ప్రజలకు సామాజిక సేవలు క్లబ్ ద్వారా అందిస్తున్నామన్నారు. దాదాపు 200 దేశాల్లో క్లబ్ సేవలు విస్తరించాయన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ అడిషనల్ ట్రేజరర్ కల్వరి కృష్ణ, కోఆర్డినేటర్ రమేష్, జిల్లా బాధ్యులు గోపాల్, రిజీనల్ సెక్రెటరీ సత్యం, జోన్ చైర్మన్ సంతోష్, క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

లింగాల: మండల పరిధిలోని శాయిన్‌పేట చెంచు కాలనీలో తాగునీటి అవసరాలను తీర్చే బోరు మోటారు స్టార్టర్‌ను, వైర్‌ను ఈ నెల 15న గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో తాగునీటికి చెంచులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి చెందిన చెంచులు పక్కనే ఉన్న చెరువు నీటిని తాగాల్సిన దుస్థితి నెలకొందని వీటీడీఏ చైర్మన్ నర్సింహ్మ పేర్కొన్నారు. చోరీ ఘటనపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు పంపిణీ

గోపాల్‌పేట: విద్యాశాఖ ద్వారా పాఠశాలకు అందించేందుకు వచ్చిన లైబ్రరీ పుస్తకాలను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 261 రకాల పుస్తకాలు, ఉన్నత పాఠశాలలకు 120 రకాల పుస్తకాలను ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లకు అందించారు. పుస్తకాలు చదవడం ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తాయని, విద్యార్థుల్లో పఠనాసక్తి కూడా పెరుగుతుందని చెప్పారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్